క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్‌ను పేదలు వినియోగించుకోవాలి



పర్వతగిరి : పేదలు సీఎంఆర్‌ఎఫ్‌ను ఆపత్కాలంలో వినియోగించుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్‌.నాగరాజు కోరారు. మండల కేంద్రానికి చెందిన మహ్మద్‌ ఖర్షీద్‌కు మంజూరైన రూ.44 వేల సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కును స్వయంగా ఇంటికి వెళ్లి సోమవారం ఆయన అందజేశారు. అనంతరం ఖర్షీద్‌ అనారోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. పేదలకు సీఎంఆర్‌ఎఫ్‌ ద్వారా సాయం అందజేస్తామని ఎమ్మెల్యే చెప్పారు.

రాష్ట్రంలో నిత్యం అరెస్టులే..



రాయపర్తి : రాష్ట్రంలో నిత్యం అరెస్టులే కొనసాగుతున్నాయని బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు మూనావత్‌ నర్సింహనాయక్‌ మండిపడ్డారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌ బిల్లులు ఇవ్వాలని ఏడాదిగా అడుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా పోలీసులతో అణగదొక్కాలని చూస్తోందని ధ్వజమెత్తారు. శాంతియుతంగా నిరసన తలపెట్టిన సర్పంచ్‌లను అరెస్ట్‌ చేయడం దుర్మార్గమన్నారు. పల్లెప్రగతి పేరిట చేపట్టిన కార్యక్రమానికి తూట్లు పొడిచి నిధులు విడుదల చేయకుండా ఆపుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌ గౌడ్‌, నాయకులు ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, చిన్నాల రాజబాబు, కుందూరు యాదగిరిరెడ్డి, పోగులకొండ వేణు, సుధాకర్‌, అశ్రఫ్‌ పాషా, రాము, సంకినేని ఎల్లస్వామి, పనికర కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



గీసుకొండ : జాతీయ మాలమహానాడు మండల అధ్యక్షుడిగా నాంపల్లి శ్రీనివాస్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు బొల్లం రాంకుమార్‌ తెలిపారు. ఈ మేరకు శ్రీనివాస్‌కు రాంకుమార్‌ నియామక పత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాస్‌ మాట్లాడారు. మండలంలో మాలమహానాడు బలోపేతానికి పాటుపడతానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తుప్పరి నర్సింహస్వామి, కార్యవర్గ సభ్యుడు సరికిటి దేవేందర్‌, జిల్లా యూత్‌ అధ్యక్షుడు ఉసిల్ల ఉదయ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

నర్సంపేట : పట్టణానికి చెందిన గీత కార్మికుడు బైరి శ్రీనివాస్‌ ఈనెల 3న తాటిచెట్టు నుంచి పడి గాయాలపాలై చికిత్స పొందుతుండగా ఆయన్ను గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ అనంతుల రమేశ్‌ గౌడ్‌, స్థానిక మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ నాగెల్లి వెంకటనారాయణగౌడ్‌ సోమవారం పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడారు. శ్రీనివాస్‌కు పరిహారం అందేలా ఎక్సైజ్‌, బీసీ కార్పొరేషన్‌లకు వివరాలు పంపిస్తామని చెప్పారు. శ్రీనివాస్‌గౌడ్‌కు ప్రభుత్వం వెంటనే ఆస్పత్రి ఖర్చుల కోసం రూ.25 వేలు మంజూరు చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సంఘం పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి కుమార్‌, కోశాధికారి కోల వెంకటేశ్వర్లు, మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకట్‌, నాయకులు శీలం వీరన్న, మద్దెల సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

ఐనవోలు : విద్యుత్‌ సవరణ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని అఖిల భారత కిసాన్‌ సభ జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి డిమాండ్‌ చేశారు. మండల కేంద్రంలో రైతు సంఘం మండల నాయకుల సమావేశం మడిగె నాగరాజు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడారు. కేంద్రం విద్యుత్‌ నష్టాన్ని తగ్గించి చూపేందుకు వ్యవసాయ పంపుసెట్ల వినియోగంపై అదనపు వినియోగాన్ని చూపుతుందని ఆక్షేపించారు. సమావేశంలో జీఎంపీఎస్‌ జిల్లా కార్యదర్శి లింగయ్య, ఉపేందర్‌, మోహన్‌, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్‌

ఐనవోలు : పేకాడుతున్న నలుగురిని అరెస్ట్‌ చేసినట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్‌ తెలిపారు. కక్కిరాలపల్లి గ్రామంలోని ఎస్సీ కాలని పోచమ్మ గుడి సమీపంలో పేకాడుతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించగా రూ.1,910 నగదు, మూడు సెల్‌ఫోన్‌లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పూర్తిస్థాయి సాగుకు అనుమతించేనా..?

- పాకాల తైబందీ ప్రకటనపై ఎదురుచూపులు
- కోత దశకు చేరుకున్న వరి



కోత దశకు చేరుకున్న పాకాల ఆయకట్టు వరి పంటలు

ఖానాపురం : పాకాల ఆయకట్టు కింద రబీలో పంటల సాగు ప్రకటనపై రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఖరీఫ్‌ సాగు పూర్తి అవుతున్న ప్రస్తుత తరుణంలో రబీ ప్రకటనపై రైతుల్లో చర్చ జోరందుకుంది. ఆయకట్టు కింద వరి పంట కోతలు మొదలవుతున్నాయి. పంటలన్నీ దాదాపుగా కోత దశకు చేరుకోవడంతో రబీ ప్రకటనపై రైతుల్లో కలవరం నెలకొంది. ఆయకట్టులో పూర్తిస్థాయి సాగుకు అనుమతించేనా..? లేకుంటే రొటేషన్‌ ప్రకారం అనుమతిస్తారా? అని ఆసక్తి నెలకొంది..

జిల్లాలో ధాన్యాగార కేంద్రంగా గుర్తింపు పొందింది పాకాల ఆయకట్టు. ఆయకట్టు పూర్తిస్థాయి నీటి మట్టం 30.3 ఫీట్లు. వర్షాకాలంలో సరస్సు పూర్తిస్థాయిలో నిండి మత్తడి పోయడం పరిపాటి. సరస్సు పూర్తిస్థాయిలో నిండితే ఖరీఫ్‌లో 29 వేల 500 ఎకరాల్లో వరి పంట సాగు అవుతుంది. ఆయకట్టులోని ప్రధాన కాల్వలైన తుంగబంధం, జాలుబంధం, సంగెం, పసునూరు, మాటువీరారంతోపాటు పలు కాల్వల కింద ఖానాపురం, నర్సంపేట, చెన్నారావుపేట మండలాలకు చెందిన రైతులు వరి పంట సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో పంటలు పూర్తి అయ్యే నాటికి సరస్సులో మిగిలిన నీటితో రొటేషన్‌ ప్రకారం ఆయకట్టు కింద తైబందీ ప్రకటన ఇవ్వడం ఆనవాయితీగా వచ్చేది. నీటి లభ్యత ఆధారంగా రొటేషన్‌ పద్ధతి కొనసాగింది. కాగా గత ప్రభుత్వ హయాంలో నాటి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పాకాలకు గోదావరి జలాల తరలింపు ప్రాజెక్టును తీసుకురావడంతో ఆయకట్టు కింద రబీలో రొటేషన్‌ విధానాన్ని తొలగించి పూర్తిస్థాయిలో సాగుకు నీరు అందించారు. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో గత రబీ సీజన్‌లో ప్రస్తుత ఎమ్మెల్యే మాధవరెడ్డి ఆధ్వర్యంలో తైబందీ నిర్ణయించినా ధర్మరావుపేట చివరి ఆయకట్టు రైతులు సాగుకు ముందుకు రాలేదు. పంటల సాగుకు నీరందించడంలో ఇరిగేషన్‌ అధికారులు కొంత మేర చేతులెత్తేసిన పరిస్థితి సైతం నెలకొంది. కాంగ్రెస్‌ నాయకులు కాల్వల్లో పిచ్చిమొక్కలు తొలగిస్తూ నీరందించడానికి చొరవ చూపారు. ప్రస్తుత సీజన్‌లో పూర్తిస్థాయిలో సాగుకు అనుమతి ఇస్తే రైతులు ముందుకొస్తారా? అని అధికారుల్లో అభిప్రాయం నెలకొన్నట్లు తెలిసింది.

ప్రకటన కోసం ఎదురుచూపులు

పాకాల ఆయకట్టు కింద సాగైన వరి పంట దాదాపు కోత దశకు చేరుకుంది. కోతలు సైతం మొదలవుతున్నాయి. రబీ సాగు కోసం రైతులను ముందస్తుగా సమయాత్తం చేయాల్సిన బాధ్యత ఇరిగేషన్‌ అధికారుల మీదే ఉంటుంది. ప్రస్తుతం సరస్సులోని 24.8 ఫీట్ల నీటిమట్టం ఉంది. ఈ నీరు పూర్తిస్థాయి సాగుకు సరిపోని పరిస్థితి కనపడుతోంది. పూర్తిస్థాయిలో సాగుకు అనుమతిస్తే గోదావరి జలాలను తరలించాల్సిందే. గోదావరి జలాలను సరస్సులోకి తీసుకొచ్చే విషయమై ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అధికారులతో చర్చించినట్లు సమాచారం. ఆరుతడి పంటలు సాగు చేస్తే మేలని అధికారులు సూచించగా అందుకు భూములు ఉపయోగపడవనే విషయాన్ని ఎమ్మెల్యే చెప్పినట్లు తెలిసింది. రైతుల అభిప్రాయాలు సేకరించాకే రబీపై నిర్ణయం తీసుకుందామని నిర్ణయించినట్లు ప్రచారం సాగుతోంది.

రైతుల అభిప్రాయాలు సేకరిస్తాం

పాకాల ఆయకట్టు కింద రబీ సాగు కోసం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఈ విషయంలో రైతుల అభిప్రాయాలు సేకరిస్తాం. అనంతరమే సాగు విషయాన్ని ప్రకటిస్తాం.

-రమేశ్‌, డీఈ

రూ. కోటి కేటాయిస్తేనే కాల్వల శుభ్రం

పాకాల ఆయకట్టు కింద రబీలో పంటల సాగు కత్తి మీద సాములాంటిదే. రొటేషన్‌ విధానంలో, గోదావరి జలాలు వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో సాగుతో కాల్వల పరిస్థితి అధ్వానంగా ఉండేది. నీటి విడుదల జరిగినా కాల్వల్లో పిచ్చిమొక్కలు, సిల్ట్‌ పేరుకుపోవడంతో తిప్పలు తప్పేవి కావు. రైతులు కాల్వలతో కుస్తీపడిన ఘటనలు కోకొల్లలు. కాంగ్రెస్‌ నాయకులు కాల్వల్లోని పిచ్చిమొక్కలు తొలగించడానికి నిధులు వస్తాయనే ఆశతో పనులు చేసి రైతులకు నీరందించే దిశగా చొరవ చూపుతున్నారు. రబీలో కాల్వల్లో పిచ్చిమొక్కలు, సిల్ట్‌ తొలగించడానికి కోటి రూపాయలు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా ప్రభుత్వం నుంచి కేటాయింపులు లేకపోవడంతో రబీలో కాల్వల ద్వారా నీరందించడంలో ఇబ్బందులకు అవకాశాలున్నాయి.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

- ఏసీపీ కిరణ్‌కుమార్‌



మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్‌కుమార్‌

నెక్కొండ : సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ధ్యేయమని నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్‌ స్పష్టం చేశారు. మండలంలోని చంద్రుగొండలో సోమవారం సాయంత్రం కార్డన్‌ సెర్చ్‌ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో ఏసీపీ మాట్లాడారు. అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేసేలా కార్డన్‌ సెర్చ్‌ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనదార్లు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలతోపాటు డ్రైవింగ్‌ లైసెన్స్‌ కలిగి ఉండాలని, మద్యం మత్తులో వాహనాలు నడపొద్దని, మైనర్లకు వాహనాలు నడిపేందుకు ఇవ్వొద్దని, తదితర సూచనలు చేశారు. సైబర్‌ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. నేరాల నివారణే లక్ష్యంగా దొంగలు, పాత నేరస్తులు, అనుమానితులను గుర్తించేలా తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎస్సై సురేందర్‌ మాట్లాడుతూ తనిఖీల సందర్భంగా గ్రామంలో సరైన పత్రాలు లేని 28 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు సీజ్‌ చేశామన్నారు. కార్యక్రమంలో సీఐ చంద్రమోహన్‌, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించండి

- పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి



నెక్కొండ : మాట్లాడుతున్న శ్రీపాల్‌రెడ్డి

నెక్కొండ : త్వరలో జరగనున్న వరంగల్‌, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు ఓటేసి గెలిపించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి కోరారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల, మోడల్‌ స్కూల్‌, గురుకుల విద్యాలయాలు, జెడ్పీ హైస్కూళ్లలో సోమవారం ఆయన ఉపాధ్యాయులను కలుస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధ్యాపక, ఉపాధ్యాయ సంఘాలు తన అభ్యర్థిత్వాన్ని బలపరిచిన క్రమంలో అర్హత కలిగిన ఉపాధ్యాయులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని సూచించారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలు పరిష్కరిస్తున్న సంఘంగా పీఆర్‌టీయూను అభివర్ణించారు. సమావేశంలో యూనియన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్‌ గఫార్‌, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాలోతు ప్రతాప్‌సింగ్‌, కక్ర యాకూబ్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్‌ అధ్యక్షులు రాపోలు యాకయ్య, రవీంద్రనాథ్‌, గురిజాల శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనాథ్‌, జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మండల బాధ్యులు ఐలయ్య, భిక్షపతి, ఈర్యానాయక్‌, రామకృష్ణ, యుగేందర్‌, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట : పట్టణంలోని పాఠశాలలు, కళాశాలలను పీఆర్‌టీయూ నాయకులు సందర్శించి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్లం దామోదర్‌రెడ్డి మాట్లాడారు. యూనియన్‌ బలపర్చిన శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ అమలు చేసేలా పోరాడతామని చెప్పారు. యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తున్న శ్రీపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్‌ అధ్యక్షుడు శాన ఉమామహేశ్వర్‌, మండల అధ్యక్షుడు కోడం సాంబయ్య, ప్రధాన కార్యదర్శి శీలం మల్లయ్య, మండల అసోసియేట్‌ అధ్యక్షుడు గుడివాడ అశోక్‌, రాష్ట్ర, కార్యదర్శి నాగేందర్‌, తదితరులు పాల్గొన్నారు.

కులగణనను పారదర్శకంగా నిర్వహించాలి



వర్ధన్నపేట : మాట్లాడుతున్న ఎంపీడీఓ

సాక్షి నెట్‌వర్క్‌ : మండలాల్లో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణనను పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ప్రత్యేక అధికారులు కోరారు. జిల్లాలోని వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరి, ఖానాపురం మండల పరిషత్‌ కార్యాలయాల్లో ఎన్యూమరేటర్లకు సోమవారం ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాల్లో సంబంధిత ఎంపీడీఓలు వెంకటరమణ, గుగులోతు కిషన్‌నాయక్‌, మాలోతు శంకర్‌నాయక్‌, భారతి, తహసీల్దార్లు శ్రీనివాస్‌, కిరణ్‌కుమార్‌, మండల ప్రత్యేక అధికారి నీరజ మాట్లాడారు. ఎన్యూమరేటర్లు సర్వేపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఫార్మెట్‌లో అవసరమైన అన్ని వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలని చెప్పారు. తదనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. తొలుత ప్రతి ఇంటి డోర్‌కు స్టిక్కర్‌ అంటించి సర్వే తేదీని నమోదు చేసి సదరు ఇంటి యజమాని లేదా కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తీసుకోవాలని చెప్పారు.

స్విమ్మింగ్‌ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



రాయపర్తి : మండలంలోని కాట్రపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి బెల్లి కౌశిక్‌ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్‌ పోటీల్లో ప్రతిభ చాటినట్లు హెచ్‌ఎం ఝాన్సీలక్ష్మీ తెలిపారు. పాఠశాల ఆవరణలో కౌశిక్‌ను, పీఈటీ సమ్మయ్యను హెచ్‌ఎం ఝాన్సీలక్ష్మీ, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడారు. ఈనెల 2 నుంచి 4 వరకు రంగారెడ్డి జిల్లా బోరంపేటలో జరిగిన 68వ ఎస్‌జీఎఫ్‌ఐ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్‌ పోటీల్లో కౌశిక్‌ ప్రతిభ చాటి తృతీయ స్థానంలో నిలిచి బ్రాంజ్‌ మెడల్‌ సాధించినట్లు తెలిపారు.

అరెస్టులు అప్రజాస్వామికం



సంగెం : పోలీస్‌స్టేషన్‌లో సాగర్‌రెడ్డి, తదితరులు

సాక్షి నెట్‌వర్క్‌ : మాజీ సర్పంచ్‌ల అరెస్టులు అప్రజాస్వామికమని సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు పూలుగు సాగర్‌రెడ్డి విమర్శించారు. జిల్లావ్యాప్తంగా మాజీ సర్పంచ్‌లను పోలీసులు సోమవారం తెల్లవారుజాము నుంచే అరెస్ట్‌ చేశారు. పెండింగ్‌ బిల్లులు చెల్లించాలని డిమాండ్‌ చేస్తూ హైదరాబాద్‌లో తలపెట్టిన సమావేశానికి వెళ్లేందుకు సమాయత్తమైన మాజీ సర్పంచ్‌లను ఇళ్లలోనే పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా రాయపర్తి, సంగెం, గీసుకొండ, దుగ్గొండి, చెన్నారావుపేట, నల్లబెల్లి, తదితర మండలాల్లో మాజీ సర్పంచ్‌లు నిరసన తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం అరెస్టులు మానుకుని బకాయి ఉన్న అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించాలని కోరారు.

ప్రత్యేక కమిషన్‌తో కులగణన చేపట్టండి



మాట్లాడుతున్న వెంకటనారాయణ

నర్సంపేట : హైకోర్టు సూచన మేరకు ప్రత్యేక కమిషన్‌ ద్వారానే బీసీ కులగణన చేపట్టాలని బీఆర్‌ఎస్‌ పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న కమిషన్‌ ద్వారా కులగణన చేపడితే రిజర్వేషన్ల ప్రక్రియ మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉందన్నారు. కులగణన పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ సర్వే చేపడుతోందని, సంబంధం లేని అనేక అంశాలను చేర్చి ప్రజలను ఆందోళనకు గురి చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థలు ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ కల్పించాలని, రిజర్వేషన్‌ ప్రక్రియను త్వరగా తేల్చి స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్‌, బీఆర్‌ఎస్‌ పట్టణ ప్రచార కార్యదర్శి, మాజీ కౌన్సిలర్‌ మండల శ్రీనివాస్‌, కౌన్సిలర్‌ పాషా, నాయకులు నాగిశెట్టి ప్రసాద్‌, గందె చంద్రమౌళి, రామసహాయం సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

‘దళితులను బానిసలుగా మార్చేలా కుట్ర’



ఖానాపురం : దళితులను బానిసలుగా మార్చేలా విభజన పేరుతో కుట్ర చేస్తున్నారని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్‌ అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర మండల కేంద్రానికి సోమవారం చేరుకుంది. ఈ సందర్భంగా మంగళవారిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణను వ్యతిరేకిస్తూ 16 జిల్లాల పరిధిలో వెయ్యి కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఆర్టికల్‌ 341ను సవరిస్తేనే వర్గీకరణ సాధ్యమవుతుందని చెప్పారు. ఓటు బ్యాంకు కోసం ఎస్సీలను విచ్ఛిన్నం చేయడానికి ప్రధాని మోదీ కుట్ర పన్నుతున్నాడని ఆందోళన వెలిబుచ్చారు. మనువాదుల చేతుల్లో మంద కృష్ణ కీలుబొమ్మగా మారాడని ధ్వజమెత్తారు. ఆర్టికల్‌ 341ని సవరించాలంటే 16 రాష్ట్రాల్లో అసెంబ్లీ తీర్మాణాలు చేయాల్సి ఉంటుందన్నారు. ఇవన్నీ లేకుండానే దొడ్డిదారిన కోర్టు ద్వారా తీర్పు ఇప్పించారని మండిపడ్డారు. మాల కులస్తుల త్యాగాలను విస్మరించి వర్గీకరణ కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేయడం దారుణమన్నారు. డిసెంబర్‌ 1న హైదరాబాద్‌లో తలపెట్టిన సంగ్రామ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న రాజు, నాయకులు ముడుసు రమేశ్‌, మర్రి ప్రభాకర్‌, పీసరి వెంకన్న, సమ్మయ్య, బూడిద నాగరాజు, కొంకుల రాజేశ్‌, అనిల్‌, శ్రీనివాస్‌, గాజ నాగరాజు, చంద్రశేఖర్‌, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు తప్పనిసరి

- స్వీప్‌ నోడల్‌ అధికారి భాగ్యలక్ష్మి



మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

నర్సంపేట : అర్హులందరికీ ఓటు హక్కు తప్పనిసరిగా ఉండాలని స్వీప్‌ నోడల్‌ అధికారి భాగ్యలక్ష్మి స్పష్టం చేశారు. పట్టణంలోని ఎస్సీ, మైనార్టీ వెల్ఫేర్‌ గురుకుల పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 18 ఏళ్ల వయస్సు కలిగిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని సూచించారు. మెరుగైన పాలకులను ఎన్నుకుని సమసమాజ నిర్మాణానికి బాటలు వేయడంలో ఓటు పాత్ర కీలకమన్నారు. సుపరిపాలన అందించగల నాయకులను ఎన్నుకునేలా రాజ్యాంగం ఓటు హక్కు కల్పించిందన్నారు. ఓటును వజ్రాయుధం లా వర్ణించారు. అర్హులు ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఓటు ప్రాశస్త్యాన్ని ప్రచారం చేయడంలో చొరవ చూపాలని కోరారు.

ఉద్యోగ విరమణ ప్రయోజనాలు కల్పించాలి



వినతిపత్రం ఇస్తున్న భారతి, నాయకులు

నర్సంపేట : అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు ఉద్యోగ విరమణ ప్రయోజనాలు కల్పించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్‌ అండ్‌ హెల్పర్స్‌ యూనియన్‌ (బీఆర్‌టీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఈ మేరకు ఆమె ఆధ్వర్యంలోని బృందం హైదరాబాద్‌లోని కార్యాలయంలో మహిళా అభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్‌ కాంతి వెస్లీకి సోమవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం భారతి మాట్లాడారు. పలువురు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సుమారు 39 ఏళ్లపాటు చాలీచాలని గౌరవ వేతనంతో వెట్టిచాకిరీ చేసినట్లు తెలిపారు. జూలైలో రిటైర్‌ అయిన అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు వెంటనే ప్రయోజనాలు అందజేయాలని కోరారు. మంత్రి ఇచ్చిన హామీ మేరకు టీచర్‌కు రూ.2 లక్షలు, ఆయాకు రూ.లక్ష చొప్పున వెంటనే చెల్లించడంతోపాటు పెన్షన్‌ సౌకర్యం కల్పించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో యూనియన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.రమాతార, కోశాధికారి ఎం.వేదవతి, రాష్ట్ర నాయకులు జె.ఎల్లమ్మ, పి.రజిత తదితరులు పాల్గొన్నారు.

ఐక్యఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం



దుగ్గొండి : పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

దుగ్గొండి : ఐక్యఉద్యమాలతోనే ప్రజాసమస్యలు పరిష్కారమవుతాయని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు కుసుంబ బాబురావు స్పష్టం చేశారు. ఈనెల 7న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తలపెట్టిన జాతీయ సెమినార్‌ వాల్‌పోస్టర్లను మండలంలోని గిర్నిబావిలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ విలువలను నిర్వీర్యం చేస్తూ ఫాసిస్టు విధానాలను అవలంభిస్తోందని విమర్శించారు. బీజేపీ విధానాలతో సమాజంలో ప్రజల నడుమ నానాటికీ అంతరాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. మనువాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా దేశంలోని వామపక్ష పార్టీలు ఏకమై సంఘటిత ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని ఆకాంక్షించారు. విద్యావంతులు, మేథావులు అధిక సంఖ్యలో తరలివచ్చి సెమినార్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సింగతి మల్లికార్జున్‌, బుడిమె సురేందర్‌, బత్తిని కుమారస్వామి, సతీశ్‌, తదితరులు పాల్గొన్నారు.

వసతుల కల్పనలో పాలకులు విఫలం

నర్సంపేట రూరల్‌ : ప్రజల కనీస మౌలిక వసతులు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఎంసీపీఐ(యూ) డివిజన్‌ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, జిల్లా కమిటీ సభ్యుడు కొట్టి సదానందం విమర్శించారు. హైదరాబాద్‌లో ఈనెల 7న తలపెట్టిన జాతీయ సెమినార్‌ వాల్‌పోస్టర్లను నర్సంపేట మండలంలోని మాదన్నపేటలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజమౌళి, సదానందం మాట్లాడారు. ‘ప్రస్తుత రాజకీయ పరిస్థితులు–మతోన్మాద, ఫాసిస్టు శక్తులతో ప్రమాదం, వామపక్ష కమ్యూనిస్టు శక్తుల తక్షణ కర్తవ్యం’ అంశంపై జాతీయ సెమినార్‌ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెమినార్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అనుమాల రమేశ్‌, కర్నె సాంబయ్య, గుర్రం రవి, ఆకుల రాజేందర్‌, అల్లం నర్సయ్య, కొట్టి సూరయ్య, వక్కల రాజమౌళి, కొట్టి శ్రీనివాస్‌, కందికొండ సాంబయ్య, గాదెగోని బాబు తదితరులు పాల్గొన్నారు.

కాల్వలోకి దూసుకెళ్లిన లారీ

ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్‌ సమీపంలో గల జాతీయ రహదారిపై ఫ్లైయాష్‌తో వెళుతున్న లారీ అదుపు తప్పి కాల్వలోకి దూసుకెళ్లింది. డ్రైవర్‌ నిద్రమత్తులో ఉండడం వలన ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి ప్రాణహాని జరగలేదు.

షటిల్‌ బ్యాడ్మింటన్‌ విజేతగా ‘వరంగల్‌’



విజేతలతో చాందిని సుధాకర్‌, తదితరులు

నల్లబెల్లి : ఉమ్మడి వరంగల్‌ జిల్లా స్థాయి బాలుర షటిల్‌ బ్యాడ్మింటన్‌ విజేతగా వరంగల్‌ జట్టు నిలిచింది. మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో యువసేన స్పోర్ట్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో మండల కేంద్రానికి చెందిన రావుల పెద్ద రవి జ్ఞాపకార్థం రెండ్రోజులుపాటు నిర్వహించిన పోటీలు సోమవారం ముగిశాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వచ్చిన 40 జట్ల క్రీడాకారులు పోటీపడ్డారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ వ్యాపారి రాజబోయిన చాందిని సుధాకర్‌ హాజరై విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. క్రీడలు మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదపడతాయని చెప్పారు. వరంగల్‌కు చెందిన మనిదీప్‌ జట్టు ప్రథమ స్థానంలో నిలిచి రూ.8 వేల నగదుతోపాటు ట్రోఫీని, నల్లబెల్లికి చెందిన కొండ్లె శశాంక్‌ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.4 వేల నగదుతోపాటు ట్రోఫీ సొంతం చేసుకున్నాయి. కార్యక్రమంలో యువసేన స్పోర్ట్‌ క్లబ్‌ అధ్యక్షుడు బొడిగె వంశీ, గౌరవ అధ్యక్షుడు పప్పు హేమంత్‌, ఉపాధ్యక్షుడు రావుల కేశవర్మ, పండుగ తరుణ్‌, కోశాధికారి గడ్డం లక్ష్మణ్‌, రవి కుటుంబ సభ్యులు కేశవర్మ, మౌనిక, రమేశ్‌, సాయి, శాలిని, నాయకులు పాండవుల రాంబాబు, నీల శ్రీనివాస్‌, కోటగిరి నారాయణ, పిట్టల ప్రవీణ్‌, మాసంపెల్లి అఖిల్‌ పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనులకు దరఖాస్తు చేసుకోండి

సంగెం : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2024–25 సంవత్సరంలో చేపట్టనున్న పనుల కోసం రైతులు ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కాసర్ల రవీందర్‌ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. జాబ్‌కార్డులు కలిగి వ్యవసాయ భూములున్న రైతులు వ్యక్తిగతంగా జామ, నిమ్మ, మామిడి, దానిమ్మ, సీతాఫల్‌, డ్రాగన్‌ ఫ్రూట్‌, మునగ, కొబ్బరి, ఆయిల్‌ పామ్‌, జామాయిల్‌, గడ్డి పెంపకం, గొర్ల షెడ్‌, పశువుల షెడ్ల నిర్మాణం, రైతుల భూములకు వెళ్లేందుకు మట్టి రోడ్డు, చాపల చెరువుల తవ్వకం, ఎస్సీ ఎస్టీ భూముల్లో భూమి లెవలింగ్‌, జంగిల్‌ కట్టింగ్‌, కొత్త బావుల తవ్వకం, పాత బావుల పూడికతీత, ఇంకుడు గుంతలు, కంపోస్ట్‌ ఎరువుల గుంత, భూమి చుట్టూ కందకాలు, నాడెపు కంపోస్ట్‌, మట్టి కట్టలు, వ్యక్తిగత నర్సరీ పెంపకం, అజోలా గడ్డి పెంపకం వంటి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన రైతులు జాబ్‌కార్డుల జిరాక్స్‌ కాపీలతో సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్‌ అసిస్టెంట్లకు దరఖాస్తులు అందజేయాలని సూచించారు.